క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం



బుల్లయ్య కళాశాల రోడ్‌లో నిర్మిస్తున్న స్పీడ్ బ్రేకర్

సీతంపేట : బుల్లయ్య కళాశాల రోడ్‌లో వాహనాల వేగ నియంత్రణకు రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. సత్యం సెంటర్ నుంచి రామాటాకీస్ కూడలి వైపు, అలాగే రామాటాకీస్ కూడలి నుంచి సత్యం సెంటర్ వైపు వాహనాలు వేగంగా దూసుకొస్తుండడంతో ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నియంత్రణకు ఎప్పటి నుంచో ఈ మార్గంలో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని డిమాండ్ ఉంది. ప్రస్తుతం అది కార్యరూపం దాల్చడంతో సమస్య పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో బాలామణి, తదితరులు

సీతంపేట : అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహాత్ముడు లూయిస్ బ్రెయిలీ అని ఎంఈవో బాలామణి అన్నారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ పాఠశాల ఆవరణలో గల భవిత సెంటర్‌లో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా జీవీఎంసీ హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీ నరసతో కలిసి బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్నవారికి చదవడానికి, రాయడానికి వీలుగా ప్రత్యేక లిపిని బ్రెయిలీ ఆవిష్కరించారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా బ్రెయిలీ లిపి గుర్తింపు పొంది, నేటికీ ఉపయోగిస్తున్నారని కొనియాడారు కార్యక్రమంలో భవిత టీచర్ జగదాంబ, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



పాపారావు (ఫైల్)

సీతమ్మధార : మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం సాయిబాబా ఆలయం పక్కన పాలబూతు వెనుక ప్రాంతంలో పాపారావు (90) కుటుంబ సభ్యులతో కలిసి నివసించేవారు. ఆయనకు కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఎక్కడికీ వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ శుక్రవారం రాత్రి ఇంటి గేటు తీసుకుని పాపారావు బయటకు వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ లభిస్తే 99127 29300, 96669 70436కు సమాచారం అందించాలని కోరారు.

కారును ఢీకొట్టిన లారీ



సిమెంట్ దిమ్మల పైకి దూసుకుపోయిన కారు

సీతమ్మధార : సత్యం కూడలిలో శనివారం తెల్లవారుజామున కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఒక కుటుంబం కారులో శనివారం తెల్లవారుజామున రామాటాకీస్ నుంచి సీతమ్మధార వైపు వస్తున్నారు. అటుగా గురుద్వార్ నుంచి మద్దిలపాలెం వైపుగా వెళ్లే లారీ సిగ్నల్ చూడకుండా సత్యం కూడలి దాటుతున్న కారును బలంగా ఢీకొట్టడంతో పక్కనే ఉన్న సిమెంట్ దిమ్మలపైకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న నలుగురూ సురక్షితంగా బయటపడ్డారు. ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞానం వినోదం



మురళీనగర్‌లోని పార్కుల్లో అద్భుత విగ్రహాలు

చిన్నారులూ.. చూసొద్దాం రండి

సండే స్పెషల్



ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో వివేకానందుడు

మురళీనగర్ : జంతువులు.. జాతీయ నాయకులు.. ఆధ్యాత్మిక విగ్రహాలు... ఇలా అన్నీ ఒక చోట కొలువు తీరితే ఎంత ఆనందంగా ఉంటుందో కదా...!! వీటిని చూడాలంటే ఎక్కడికో దూర ప్రాంతాలకు, జంతు ప్రదర్శన శాలలు, ఆలయాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్లాల్సిన పని లేదు. మురళీనగర్‌లోని పార్కులను సందర్శిస్తే చాలు. ఇవన్నీ మీ కళ్ల ముందు ప్రత్యక్షమవుతాయి. అందుకే ఇక్కడి పార్కులు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి.



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మహాత్ముడి విగ్రహం

దాతల సాయంతో ఏర్పాటు

మురళీనగర్‌లోని వివిధ పార్కుల్లోని విజ్ఞానదాయకమైన విగ్రహాలన్నీ దాతల సాయంతోనే ఏర్పాటు చేశారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో మహాత్మా గాంధీ విగ్రహాన్ని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఏర్పాటు చేయగా బుద్ధ భగవానుడి విగ్రహాన్ని ఉప్పలపాటి శుభ ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర ప్రముఖుల చిత్రాలను క్లబ్ సభ్యులు, పూర్వ అధ్యక్షుల సహకారంతో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎక్కడ చూసినా పచ్చదనం పరిరక్షణకు సంబంధించిన నినాదాలు కనిపిస్తాయి. విద్యార్థులు, చిన్నారులు విజ్ఞానవంతులు కావాలంటే ఓసారి మురళీనగర్‌లోని పార్కులకు వెళ్లిరావాల్సిందే. పిల్లలు ఒక సారి చూస్తే మళ్లీ వెళ్లి రావాలనిపిస్తుంది. బృందావన్ పార్కులో ఏర్పాటు చేసిన భారీ బుద్ధ భగవానుడు, **భరత మాత విగ్రహాలతోపాటు చిన్నారులను ఆకట్టుకోవడానికి జిరాఫీ, పులి, సింహం వంటి విగ్రహాలు జీవం ఉట్టిపడే విధంగా నిర్మించారు. ఇక్కడ మురళీగానలోలుడు** శ్రీకృష్ణుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. వైశాఖీ స్పోర్ట్స్ పార్కులోని నిలువెత్తు మహాత్ముడి విగ్రహం మనలో దేశ భక్తిని పెంపొందిస్తుంది. ఇక్కడి బుద్ధుడి విగ్రహంతోపాటు బాల కృష్ణుడి విగ్రహం, పచ్చదనం చూపరులను కట్టిపడేస్తాయి. ఇక ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులోని ధ్యాన మందిరంలోకి ప్రవేశించగానే మన దేశ ప్రతిష్ఠను ప్రపంచ వ్యాప్తం చేసిన వివేకానందుడి నిలువెత్తు విగ్రహం ఆధ్మాత్మిక లోకంలోకి తీసుకుపోతుంది. ఇక్కడి ఆధ్యాత్మిక మందిరాల్లోని పాలరాతి, గ్రానైట్ విగ్రహాలు ఆకట్టుకుంటాయి. రామకృష్ణ పరమహంస, శారదా మాత, శంకరాచార్యుల వారి పాల రాతి విగ్రహాలను దర్శించవచ్చు.



బృందావన్ పార్కులో మురళీకృష్ణుడు



వాకర్స్ పార్కులో ఉత్తరాంధ్ర ప్రముఖులు



ప్రశాంతి పార్కులో పాలరాతి మందిరాలు



బృందావన్ పార్కులో భారత మాత విగ్రహం



బృందావన్ పార్కులో జీబ్రా విగ్రహం



పార్కులో జిరాఫీ విగ్రహం



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో బుద్ధభగవానుడు

మహిళలకు వైద్య శిబిరం నేడు

మురళీనగర్ : కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద విశాఖపట్నం వికాస తరంగిణి, వారీజ ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నారు. అమ్మ అలవేలు మంగ అన్న సమారాధన భవనంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. త్రిదండి చినజీయర్ స్వామి ఆదేశాల మేరకు నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

8న సంక్రాంతి రంగవల్లుల పోటీలు

మురళీనగర్ : సంక్రాంతి పర్వదినం సందర్భంగా మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు 48ఎ రోడ్‌లోని ఈస్ట్ పార్కులో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామని, వివరాలకు క్లబ్ కోశాధికారి ఎం.శేషామణిని 9492873277లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

శ్రీరంగనాథస్వామికి పాశుర పారాయణం



గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన అనంతరం గోదాదేవి విగ్రహంతో మేళతాళాలు, వేద మంత్రోచ్చరణతో ఆలయ అర్చకుడు శేషాచార్యుడు, ఈవో బండారు ప్రసాద్, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరపున శ్రీరంగనాథుడికి 20వ పాశురం భక్తులు సామూహికంగా చదివి వినిపించారు. అనంతరం మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. వైభవుడికి నక్షత్ర హారతి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వైభవుడిని దర్శించుకున్నారు.

రోడ్డు మీదే విక్రయాలతో ట్రాఫిక్ ఇక్కట్లు



నక్కవానిపాలెం రోడ్డుపై విక్రయిస్తున్న కుర్చీలు



రోడ్డు మీదనే విక్రయిస్తున్న పండ్లు, కూరగాయలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో రోడ్డు మీదనే పలురకాల సామగ్రి విక్రయిస్తుండడంతో ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్న రోడ్డు మీదనే చాలా కాలంగా కుర్చీలు, బల్లలు దర్జాగా విక్రయిసున్నారు. పక్కనే ఆటోలో కూరగాయలు విక్రయిస్తున్నారు. ఫుట్‌పాత్ పక్కనే ఖాళీగా ఉన్న రోడ్డును వదిలేసి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించేలా మరీ ముందుకు వచ్చేసి కుర్చీలు, బల్లలు అమ్మడం గమనార్హం. మరోవైపు ఫుట్‌పాత్ మీదనే చేపల వ్యాపారాలు కూడా జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అలాగే ఇక్కడికి సమీపంలోనే ఆటోలో పండ్లు, కూరగాయలు సైతం విక్రయిస్తున్నారు. ఫలితంగా ఇక్కడ కుర్చీలు, బల్లలు, కూరగాయలు, పండ్లు కొనుగోలు నిమిత్తం వచ్చే వాహన చోదకులు రోడ్డు మధ్యలో వాహనాలు నిలిపేసి కొనుగోళ్లు చేయడంతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు, ఇతర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

పాఠశాల సిబ్బందికీ అవస్థలు

ఇక్కడి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల గేటు ఎదురుగానే నిత్యం ఆటోలు, కార్లు పార్కింగ్ చేయడంతో లోపలికి, బయటకు రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రోజూ వాహనాలతో ఇక్కడ ఇబ్బందికరంగా ఉంటోందని ఉపాధ్యాయులు, సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఇక్కడి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



పిల్లి జైవర్ధన్

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం సుభాష్‌నగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పిల్లి జైవర్ధన్ (17) నగరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 3న ఉదయం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి బయలుదేరి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా అందుబాటులో లేకపోవడంతో జైవర్ధన్ తండ్రి శ్రీను పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. గుర్తించిన వారు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఏయూ వీసీ పోస్టు దళితులకు కేటాయించాలి



మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

సీతంపేట : ఆంధ్రా యూనివర్సిటీ వీసీ పోస్టు దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ కోరారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏయూ వీసీ పోస్టు దళితులకు కేటాయించి సుమారు 20 సంవత్సరాలు గడిచిపోయిందన్నారు. రాష్ట్రంలో 17 యూనివర్సిటీల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీల పాలన సాగుతోందని, వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి సుమారు 4 నెలలు గడిచినా ఇంత వరకు భర్తీ చేయలేదన్నారు. అదేవిధంగా హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ పోస్టు కూడా త్వరగా భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో గుబ్బల రాంబాబు, పతివాడ రాంబాబు, సరస్వతి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు స్థలం కేటాయించాలి



స్థానికులతో మాట్లాడుతున్న జోన్ - 5 కమిషనర్ రాము

మర్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు పరిధి గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని జోన్ - 5 కమిషనర్ బి.రాము శనివారం సందర్శించారు. ఇటీవల గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించడంతో వారికి ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం కేటాయించాలని టీడీపీ నాయకుడు పోలమరెడ్డి శ్రీనివాసరావు ఇటీవల కోరారు. ఈ నేపథ్యంలో జెడ్సీ పర్యటించారు. గత 50 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో వారంతా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని నాయకులు కోరారు. ఈ విషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించి విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రీన్ గార్డెన్స్ రెసిడెన్షియల్ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆయనకు వివరించారు. వెంటనే ఆ ప్రాంతాన్ని ఆయన సందర్శించి ఆ పరిశ్రమకు సంబంధించిన అనుమతులు తనిఖీ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అప్పటి వరకు పనులు చేపట్టవద్దని పరిశ్రమ నిర్వాహకులకు సూచించారు. పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

బడ్డీ తొలగింపు అన్యాయం



రామకృష్ణానగర్‌లో బడ్డీ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

సీతంపేట : బతుకుతెరువు కోసం రోడ్డు పక్కన బడ్డీ పెట్టుకుని జీవనం సాగిస్తున్న వారిని కూడా కూటమి నాయకులు వదిలిపెట్టడం లేదు. జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో రామలింగేశ్వరాలయం గోడ పక్కన గత 16 ఏళ్లుగా ఒక వ్యక్తి బడ్డీలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. చెక్క బడ్డీ శిథిలం కావడంతో కొద్ది నెలల కిందట దాని స్థానంలో ఐరన్ బడ్డీ ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఆ వార్డు కార్పొరేటర్ సోదరుడు ఆ స్థలాన్ని తన అనుచరుడికి కేటాయించానని, వెంటనే అక్కడ ఉన్న బడ్డీ తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. జీవీఎంసీ సిబ్బంది శనివారం ఉదయం బడ్డీ తొలగించడానికి వెళ్లడంతో స్థానికులంతా కలిసి అడ్డుకున్నారు. 16 ఏళ్లుగా ఉన్న బడ్డీ తొలగించి, ఆ స్థలాన్ని వేరే వారికి అప్పగించడం అన్యాయమని ప్రశ్నించారు. తొలగిస్తే అందరివీ తొలగించాలి కానీ, ఒక్క బడ్డీ తొలగించడం సరికాదని, కార్పొరేటర్ సోదరుడు తీరు పట్ల స్థానికులంతా బడ్డీ ఎదుట నిరసన చేపట్టారు. విషయాన్ని జోనల్ కమిషనర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్తామని బాధితుడు తెలిపారు.

మత్స్య సంపద అభివృద్ధికి చర్యలు




అధికారులతో మత్స్యశాఖ కమిషనర్ దోలా శంకర్

మహారాణిపేట: రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలా శంకర్ శనివారం కేంద్రీయ మత్స్య పరిశోధన సంస్థలైన సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ), సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ)లను సందర్శించారు. ఈ సందర్భంగా సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలతో సమావేశమై రాష్ట్రంలోని తీర ప్రాంతంలో చేపల పెంపకం, ఇతర మత్స్య సంపదపై చర్చించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు ఉపాధి కల్పనకుగాను ప్రభుత్వం సీకేజ్ పెంపకం, సీవీడ్ పెంపకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో చిరు చేపలు, రొయ్యలకు ఆల్గే, రోటిఫెర్ లైవ్ ఫీడ్ ఉత్పత్తి కోసం సీఎంఎఫ్ఆర్ఐలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న ఎఫినేపిలిస్ పిల్లల పెంపక యూనిట్లు తనిఖీ చేశారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులకు శిక్షణ, యూనిట్ల స్థాపన కోసం చర్చించారు. తీరజలాల్లో ఆర్టిఫిషియల్ రీఫ్స్ ఏర్పాటు అవకాశాలపై చర్చించారు. ఆర్టిఫిషియల్ రీఫ్స్ ఏర్పాటు వల్ల సముద్రంలో చేపల బ్రీడింగ్, ఆవాసానికి అనుకూలత ఏర్పడి భవిష్యత్తులో మత్స్య సంపద ఉత్పత్తి పెరగడానికి అవకాశం ఉందన్నారు. దీని ద్వారా మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందని వివరించారు. తదుపరి సీఐఎఫ్‌టీని సందర్శించి శిక్షణ కార్యక్రమాలు, విస్తరణపై చర్చించారు. అనంతరం తిమ్మాపురం మహిళా మత్స్యకార సంఘం డ్రై ఫిష్ యార్డులో వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, ఎస్ఐఎఫ్‌టీ అడిషనల్ డైరెక్టర్ టి.సుమలత, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు శ్రీధర్, మధుసూదనరావు, మత్స్య సహాయ సంచాలకులు విజయకృష్ణ, కిరణ్‌కుమార్, మత్స్యశాఖ స్థానిక అధికారులు శేఖర్, మురళి, డాక్టర్ గోపి, నాగబాబు, మహిళా మత్స్యకార సంఘం ప్రెసిడెంట్ మారుపల్లి పార్వతమ్మ, డీపీఎం డాక్టర్ పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఏసీ కేంద్రంలో రేపు జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మహారాణిపేట ఎస్ఏసీ కేంద్రంలో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో టీఏవో డిజిటల్ ఇండియా, సెల్ పాయింట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, బి.టెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులందరూ హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులందరూ విశాఖపట్నం జిల్లాలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9676170026లో సంప్రదించవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, స్పాట్ రిజిస్ట్రేషన్‌కు కూడా అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, దాంతో అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధులు



షెల్టర్ నిర్వాహకుడు వాసుతో వృద్ధులు

సీతమ్మధార: కుటుంబ సభ్యులు వద్దంటున్నా వినకుండా విశాఖ వచ్చేసి రైల్వేస్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న ఇద్దరు వృద్ధులను ఏయూటీడీ ప్రతినిధి ప్రగడ వాసు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విజయనగరం జిల్లా ఎల్. కోట మండలం, జమ్మాదులపేటకు చెందిన గల్లా చల్లం నాయుడు (70), కొత్తవలస మండలం, రాజా కాలనీకి చెందిన స్వారంపూడి వసుంధర (65) కుటుంబ సభ్యులు వద్దంటున్నా వినకుండా వైజాగ్ వచ్చేసి రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ అక్కడే ఉంటున్నారు. నవంబర్ 22వ తేదీన ఏయూటీడీ సిబ్బంది వీరిని గుర్తించి 40 రోజుల పాటు షెల్టర్‌లో ఉంచారు. ఈ అలవాటు మానుకోవాలని సూచించారు. విశాఖ నుంచి నేరుగా తీసుకుపోయి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.